
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 25 సెప్టెంబరు 2024 | 5



పదవులు వరించెన్..

మొదలైన కార్పొరేషన్ పదవుల పందేరం



- ఒక చైర్మన్, 12 బోర్డు మెంబర్లు
- కూటమి పార్టీల శ్రేణుల్లో ఉత్సాహం
- పదవులు దక్కిన వారిలో సంతోషం
- ఆశావహుల్లో టెన్షన్.. టెన్షన్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కార్పొరేషన్ పదవుల పందేరం మొదలైంది. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీల నాయకులకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని ఆయా పదవులకు ఎంపిక చేస్తున్నట్టుగా కనిపిస్తోంది. ముఖ్యంగా వర్గాల సమీకరణలను ప్రధానంగా పరిగణలోకి తీసుకున్నట్టు తొలి జాబితా స్పష్టం చేస్తోంది. కార్పొరేషన్ పదవుల జాబితా వెల్లడితో మంగళవారం ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఎక్కడ చూసినా ఇదే చర్చ. ఈ పదవుల కోసం ఎదురుచూస్తున్న వారిలోనూ టెన్షన్ పెరిగింది. తాము ఆశిస్తున్న పదవులు దక్కుతాయో లేదోనన్న ఆందోళన కనిపిస్తోంది. ఇక తొలి జాబితాలో చోటు దక్కించుకున్న వారిలో సంతోషానికి అవధులు లేవు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కేడర్‌లలో ఈ పదవుల పంపకం కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో ఒకే ఒక్క కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. కాకినాడ నగరానికి చెందిన జనసేన నాయకుడు తోట మెహర్ సీతారామ సుధీర్‌ను రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ పదవి వరించింది. గత వైసీపీ ప్రభుత్వంలో కూడా ఈ సంస్థ చైర్మన్‌గా కాకినాడకు చెందిన మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి తండ్రి భాస్కరరెడ్డి కొనసాగారు. దీంతో మళ్లీ అదే సంస్థ చైర్మన్ పదవి కాకినాడకు దక్కినట్టయింది. ఇక ప్రకటించిన వివిధ కార్పొరేషన్లకు సంబంధించి మొత్తం 13 మంది ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వారు బోర్డు మెంబర్లుగా నియమితులయ్యారు. ఇందులో కాకినాడ జిల్లాకు నలుగురు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన నలుగురు, తూర్పు గోదావరి జిల్లా నుంచి ఐదుగురు ఉన్నారు. నామినేటెడ్ పోస్టుల పందేరానికి తెరదీయడంతో మిగిలిన ఆశావహులు తమ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేశారు.

పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా సుధీర్

రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా జనసేనకు చెందిన తోట సుధీర్‌ను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా కసరత్తు చేసి సమర్థుడినే ఎంపిక చేసిందని చెప్పాలి. వృత్తిరీత్యా న్యాయవాది అయిన తోట సుధీర్ గతంలో టీడీపీ లీగల్ సెల్ విభాగంలో సుదీర్ఘ కాలం పనిచేశారు.ఈయన ప్రస్తుతం జనసేన కాకినాడ సిటీ నియోజకవర్గ అధ్యక్షుడిగా, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. అలాగే కాకినాడ టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్, గాంధీ సెంటినరీ కాలేజీల ప్రెసిడెంట్‌గా ఉన్నారు. వ్యాపార రీత్యా పలు పెట్రోల్ బంకులు, లారీలు ఉన్నాయి. ఈయన తండ్రి గతంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఎస్ఈగా పని చేశారు. సుధీర్ న్యాయవాది అయినా వ్యవసాయం అంటే మక్కువ. ఈయన భార్య వైద్యురాలు. కూతురు వైద్య విద్య చదివి ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. తోట సుధీర్ అల్లుడు పవన్ కల్యాణ్ వ్యక్తిగత వైద్యుడు. దీంతో పవన్‌తో సుధీర్‌కు సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. కాకినాడ జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్..తోట సుధీర్ అల్లుడికి సొంత సోదరుడు. అల్లుడి ద్వారా పవన్‌తో సత్సంబంధాలు ఏర్పడడంతో సుధీర్ గతేడాది జూన్‌లో పవన్ సమక్షంలో భీమవరంలో జనసేనలో చేరారు. అప్పటి నుంచి కాకినాడ సిటీ నియోజకవర్గ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.



బియ్యం అక్రమ రవాణాకు చెక్ పెడతా..

కాకినాడ పోర్టు నుంచి పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా కాకుండా ఉక్కుపాదం మోపుతా. నాపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన డిప్యూటీ సీఎం పవన్, సీఎం చంద్రబాబు, మంత్రి మనోహర్‌కి కృతజ్ఞతలు తెలుపుతున్నా. రేషన్ బియ్యం కేవలం పేదలకే చెందే విధంగా చర్యలు తీసుకుంటా.రాష్ట్రవ్యాప్తంగా బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుంటా.

కాకినాడ జిల్లా నుంచి నలుగురు..


కదలి ఈశ్వరి


తుమ్మల పద్మజ


సత్యనారాయణ


జయకృష్ణ

కలెక్టరేట్ (కాకినాడ)/పెద్దాపురం/గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 24: కాకినాడ జిల్లాలో నలుగురు వివిధ కార్పొరేషన్ల బోర్డు సభ్యులుగా ఎన్నికయ్యారు. కాకినాడ రమణయ్యపేటకు చెందిన జనసేన నాయకురాలు కదలి ఈశ్వరి, పెద్దాపురం మండలం పులిమేరు గ్రామానికి చెందిన బీజేపీ నాయకురాలు తుమ్మల పద్మజ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ బోర్డు సభ్యులుగా నియమితులయ్యారు. రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన బేతా సత్యనారాయణ(టీడీపీ), చేబ్రోలు గ్రామానికి చెందిన సూరిశెట్టి జయ నాగకృష్ణ (జయకృష్ణ) (జనసేన)లను నియమించారు.

'తూర్పు'న నలుగురికి...


వేణుగోపాలరాయుడు


వి.రాంబాబు


స్వరూపదేవి


హరికిశోర్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 24: స్టేట్ కార్పొరేషన్ కమిటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన నలుగురు కూటమి నాయకులకు స్థానం లభించింది. రాజమహేంద్రవరానికి చెందిన టీడీపీ సీనియర్ నేత యర్రా వేణుగోపాలరాయుడును ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ మెంబరుగా నియమించారు. ఆయన గతంలో శాప్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఏపీ టూరిజం డవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులుగా మాజీ డిప్యూటీ మేయర్ వాసిరెడ్డి రాంబాబు, జనసేన నాయకురాలు గంటా స్వరూపదేవి నియమితులయ్యారు. పద్మశాలి వెల్ఫేర్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యుడుగా రాజమహేంద్రవరానికి చెందిన మాజీ కార్పొరేటర్ టిహరికిషోర్ (బాబి)ను నియమించారు.

కోనసీమలో నలుగురికి..


చిల్లా జగదీశ్వరి


నరసింహారావు


నాగేశ్వరరావు


ఆనందసాగర్

అమలాపురం/ముమ్మిడివరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాకు చెందిన నలుగురిని రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్లలో మెంబర్లుగా నియమించింది. అమలాపురానికి చెందిన మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకురాలు చిల్లా జగదీశ్వరిని ఏపీ స్టేట్ సీడ్స్ కార్పొరేషన్‌కు డైరెక్టర్‌గా నియమించారు. కాట్రేనికోనకు చెందిన మత్స్యకార నేత నాగిడి నాగేశ్వరరావును ఏపీ స్టేట్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్‌కు డైరెక్టర్‌గా నియమించారు. టీడీపీ అధికార ప్రతినిధి మోకా ఆనంద్‌సాగర్‌ను సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారు. మలికిపురానికి చెందిన జనసేన నాయకుడు గుండుబోగుల నరసింహారావును ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమించింది. టీడీపీ నాయకుడు నాగిడి నాగేశ్వరరావు మాట్లాడుతూ తనకు పార్టీ అధిష్ఠానం కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ డైరెక్టర్ పదవి కేటాయించడం సరికాదన్నారు. తనకు ఈ పదవిని స్వీకరించడం ఇష్టం లేదని, పార్టీ పునరాలోచన చేయాలని కోరారు.

కూటమి ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ చైర్మన్ పదవుల జాబితాతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కూటమి కీలక నేతలకు షాక్ తగిలింది. చైర్మన్లుగా ఎంపిక కావాల్సిన నేతలు చివరకు వివిధ కార్పొరేషన్లలో డైరెక్టర్ పదవులతో సరి పుచ్చుకోవాల్సి రావడం వారికి మింగుడు పడడం లేదు. డైరెక్టర్ పదవులకు ఇద్దరు ముగ్గురు వ్యక్తుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నట్టు తెలిసింది.

నామినేటెడ్ పోస్టులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన వారికి జాబితా చూసి షాక్ తగిలింది..

కోరుకున్న పదవి దక్కక కొందరు..అసలు పదవే దక్కక మరికొందరు నిరాశలో మునిగిపోయారు..

మంచి పదవి వస్తుందని ఊహాలోకంలో విహరించిన వారిని కొత్త పదవుల జాబితా నేలకు దించింది..



(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఆశావహులకు షాక్

- నామినేటెడ్ పదవుల్లో జిల్లా నేతలకు 'షాక్'..!
- నలుగురికి మాత్రమే డైరెక్టర్ పదవులు
- టీడీపీ నుంచి ముగ్గురు, జనసేన నుంచి ఒకరు
- చైర్మన్ పదవుల రేసులో భంగపడ్డ కీలక నేతలు

బాహాటంగానే అసంతృప్తి

గతంలో కీలక పదవులు నిర్వహించిన వారికి సైతం డైరెక్టర్ పోస్టుల్లో నియమించడం ఎంత వరకు సమంజసమంటూ తమ అసంతృప్తిని బాహాటంగానే వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. గతంలో ఎమ్మెల్యే స్థాయి క్యాండెట్లుగా ప్రచారంలోకి వెళ్లిన నాయకులు సైతం డైరెక్టర్ల పదవికే పరిమితం కావాల్సి వచ్చింది. జిల్లాలో నాలుగు కార్పొరేషన్ డైరెక్టర్ పదవులకు నలుగురిని ఎంపిక చేశారు. వారిలో ఒకరు జనసేన నుంచి ప్రాతినిత్యం వహిస్తున్నారు. మిగిలిన ముగ్గురు టీడీపీ నేతలే. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాలోని కీలక నేతలు పదవుల కోసం పైరవీలు చేపట్టారు. రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ పదవులు పొందాలని ఉవ్విళ్లూరారు. పార్టీ నేతలతో ఉన్న పరిచయాలను దృష్టిలో పెట్టుకుని అమరావతి కేంద్రంగా లాబీయింగ్ నిర్వహించారు. అయితే మంగళవారం టీడీపీ, జనసేన సంయుక్తంగా విడుదల చేసిన 19 మంది చైర్మన్ల జాబితాల్లో కోనసీమ జిల్లా నుంచి ఏ ఒక్కరికీ ప్రాతినిత్యం లేదు.

డైరెక్టర్లుగా మాత్రం నలుగురికి అవకాశం లభించింది. వారిలో మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరిని ఏపీ స్టేట్ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమించారు. పి.గన్నవరం టిక్కెట్ కోసం ప్రయత్నించి భంగపడ్డారు. పార్టీ అధికార ప్రతినిధి మోకా ఆనంద్‌సాగర్‌ను సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి పరిమితం చేశారు. గతంలో మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసిన మత్స్యకార నేత కాట్రేనికోనకు చెందిన నాగిడి నాగేశ్వరరావును ఏపీ స్టేట్ కన్స్యూమర్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్‌కు డైరెక్టర్‌గా నియమించారు. రాజోలు నియోజకవర్గ పరిధిలోని జనసేనకు చెందిన గుండుబోగుల నరసింహారావు (పెదకాపు) ఏపీ మార్క్‌ఫెడ్‌కు డైరెక్టరుగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

వీళ్లు డైరెక్టర్లు..

తీవ్ర నిరాశ..

కొత్త నియామకాల పట్ల ఒకరిద్దరు సీరియస్‌గానే అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇక కార్పొరేషన్ చైర్మన్ల కోసం ఎన్నో ఆశలు పెట్టుకున్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలకు టీడీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మింగుడుపడడం లేదు. తమ పేర్లను పార్టీ కనీసం పరిశీలించకపోవడం దారుణమంటూ వ్యాఖ్యానాలు చేస్తున్నారు. రాజకీయ చైతన్యానికి కంచుకోటగా ఉండే కోనసీమ జిల్లా నుంచి ఏ ఒక్కరినీ చైర్మన్‌గా ఎంపిక చేయకపోవడం దారుణమని, ముఖ్యంగా జనసేన ఓట్లు అధికంగా ఉండే ఈ ప్రాంతం నుంచి ఎవరినీ పట్టించుకోకపోవడం పట్ల ఆ పార్టీ నేతలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో రాజకీయ పరమైన ఇబ్బందులు తలెత్తుతాయని జనసేన నాయకులు బాహాటంగానే హెచ్చరిస్తున్నారు. టీడీపీలో కూడా అసంతృప్తులు ఎక్కువగానే ఉన్నారు. కీలక నేతలు కోసం మౌనం వహిస్తున్నారు.

ఇసుక దోపిడీ



ఇసుక అక్రమార్కులు గోదావరి నదీ ప్రాంతాల్లోకి చొరబడి రాత్రి వేళల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక నదీ పరివాహక ప్రాంతంలో గత కొంత కాలం నుంచి రాత్రి వేళల్లో అక్రమార్కులు ఇసుకను గుట్టుచప్పుడు కాకుండా బండ్లద్వారా తరలించి నిల్వ చేస్తున్నారు.


● ఆత్రేయపురం

- యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు
- రాత్రి వేళల్లో సాగిపోతున్న ఇసుక దందా
- లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు ఎగుమతి

నిల్వ చేసిన ఇసుకను లారీల ద్వారా ఎగుమతి చేస్తూ 5 యూనిట్ల లారీ రూ.18 నుంచి రూ.20 వేలకు అమ్ముతున్నారు. ఈ దందా ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఈ విషయంపై స్థానికులు తహసీల్దారు రాజేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆర్ఐ భవాని, వీఆర్వో ఏలియా వశిష్ఠ గోదావరిని ఆనుకుని ఉన్న ఇసుక తవ్వకాలను పరిశీలించారు. నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేసి ఇరిగేషన్ కార్యాలయానికి తరలించారు.



బొలెరో వ్యాన్‌ను ఢీకొన్న బైక్

6లో

- అక్కడికక్కడే ఇద్దరి మృతి
- జొన్నాడ వంతెన దగ్గర ప్రమాదం

కడియంలో చిరుతపులి

పాదముద్రల నిర్ధారణ 6లో

స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు

రుణాలు మంజూరు చేయాలి

బ్యాంకుల సంప్రదింపుల కమిటీ సమావేశంలో కలెక్టర్ మహేష్‌కుమార్



అమలాపురం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఆధారిత అనుబంధ స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు కోసం రుణాలు ఇవ్వడంలో ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం లీడ్ బ్యాంకు మేనేజర్ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ 2024-25 వార్షిక రుణ ప్రణాళిక ఆర్థిక సంవత్సరానికి గాను వివిధ రంగాలకు కలిపి రూ.14,259 కోట్లు లక్ష్యంగా నిర్దేశించారన్నారు. ఈ ఏడాది జూన్ 30 నాటికి రూ.5965 కోట్ల మేర రుణాల కల్పన లక్ష్యాన్ని ఛేదించారన్నారు. ప్రతీ బ్యాంకు మేనేజర్ తమకు నిర్దేశించిన వార్షిక రుణ లక్ష్యాలను చేరుకోవాల్సిందిగా సూచించారు. గత సమావేశంలోని మినిట్స్‌పై తీసుకున్న నిర్ణయాలను సమీక్షించారు. తొలుత ఎల్డీఎం వర్మ జీవనోపాధుల పెంపు, గ్రామీణ శిక్షణ కార్యక్రమాలు, వార్షిక రుణ ప్రణాళికలో సాధించిన ప్రగతిని వివరించారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం, మత్స్య పశుసంవర్ధక శాఖలో రుణాలతో ముడిపడి ఉన్న పథకాల తీరు తదితర అంశాలపై ప్రస్తావించారు. రుణాల మంజూరుకు సంబంధించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి అర్హులకు మేలు జరిగేలా చూడాలని అధికారులు సూచించారు. జిల్లా వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ ఆవిష్కరించారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం హనుమకుమారి, యూబీఐ రీజనల్ మేనేజర్ సాయిమనోహర్, డీఆర్డీఏ పీడీ డాక్టర్ శివశంకరప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, పశుసంవర్థకశాఖ అధికారి వెంకట్రావు, నాబార్డు ఏజీఎం స్వామినాయుడు, జీఎం ప్రసాద్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

'జాతీయ రహదారి' పెండింగ్ అభ్యంతరాలను

పరిష్కరించాలి



నిర్మాణ పనులకు సహకరించాలి
జాయింట్ కలెక్టర్ నిషాంతి


అమలాపురం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): 216 జాతీయ రహదారి అభివృద్ధికి సంబంధించి గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అభ్యంతరాలను అధికారులు సమన్వయంతో పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి రెవెన్యూ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, ఎన్‌హెచ్ అధికారులతో సమావేశమై చర్చించారు. పెండింగ్ అంశాలపై సుదీర్ఘంగా చర్చించి వాటిని పరిష్కరించే దిశగా మార్గం సుగమం చేశారు. జాతీయ రహదారి నిర్మాణ పనులు పునరుద్ధరణకు సహకరించాలని కోరారు. ఎన్‌హెచ్ నిర్మాణంలో అడ్డంకిగా ఉన్న నిర్మాణాలకు నిబంధనల మేర ఆర్అండ్‌బీ విభాగం అధికారులు చెల్లింపులు చేసి ముందుకు సాగాలన్నారు. మామిడికుదురు, రాజోలు మండలాల్లో ఈ తరహా అభ్యంతరాలు ఎక్కువగా ఉన్నట్టు ఆమె స్పష్టం చేశారు. సున్నితమైన అంశాలు, క్లయిమ్‌లు వంటి వాటిపై సమయస్ఫూర్తితో వ్యవహరించాలని కోరారు. సమావేశంలో ఎన్‌హెచ్ అధికారి శ్రీనివాసరావు, ఏఈ వెంకటరమణ, ఆర్అండ్‌బీ ఎస్ఈ బి.రాము, తహసీల్దార్ మృత్యుంజయరావు, సునీల్‌కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆశ

కొబ్బరి రైతుల మోముల్లో చిరునవ్వు కనిపించింది..ఎప్పుడూలేనంత ఉత్సాహం ఇప్పుడు వెల్లివిరిసింది. దీనికంతటికి కారణం ఏమిటో తెలుసా..? కొబ్బరి ధర రికార్డు స్థాయిలో పెరగడం..

నిరాశ

అయితే కొబ్బరి రైతుల బెంగ ఒక్కటే.. ధర ఉన్నా దిగుబడి లేదు..లాభాలు పొందే అవకాశం ఉన్నా పంట సరిగా లేదు..ధర పెరిగిందని ఆనందపడాలో పంట లేదని బాధపడాలో అర్థంకావడం లేదు..



అధరహో..

- అనూహ్యంగా పెరిగిన కొబ్బరి ధరలు
- వెయ్యి కాయ రూ.18 వేల నుంచి రూ.20వేలు
- ఇతర రాష్ట్రాలకు ఎగుమతులే కారణం
- కొబ్బరి రైతుల్లో హర్షాతిరేకాలు

6వ పేజీలో

కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు


కొండేటి చిట్టిబాబును సత్కరిస్తున్న నాయకులు

అమలాపురం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత పటిష్టం చేయడానికి కృషి చేస్తానని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన బాధ్యతలను అంకిత భావంతో అమలు చేస్తానని పేర్కొన్నారు. అమలాపురం ముస్లిం షాదీఖానాలో మంగళవారం జరిగిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవీ ప్రమాణ స్వీకారానికి మాజీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అధ్యక్షత వహించారు. సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు, మాజీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ కోసం అందరూ కష్టించి పనిచేయాలని గిడుగు రుద్రరాజు పిలుపునిచ్చారు. జిల్లా ఇన్‌చార్జిగా నియమితులైన జగతా శ్రీనివాస్ కార్యక్రమానికి హాజరయ్యారు. క్రమశిక్షణతో సమర్థవంతంగా నడిపించగల కొండేటి చిట్టిబాబుకు జిల్లా అధ్యక్ష పదవికి పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసిందని చెప్పారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని జంగా గౌతమ్ పిలుపునిచ్చారు. నూతన అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు చేత కామన ప్రభాకరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వంటెద్దు బాబి, రాష్ట్ర నేతలు చీకట్ల అబ్బాయి, యార్లగడ్డ రవీంద్ర, అయితాబత్తుల సుభాషిణి, కుడుపూడి శ్రీను, వడ్డి నాగేశ్వరరావు, గెడ్డం సురేష్ బాబు, మహ్మద్ ఆరిఫ్, శ్రీమన్నారాయణ, పాలెపు ధర్మారావు, రుద్రరాజు కృష్ణంరాజు తదితరులతో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు నూతన అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబును సన్మానించారు. తొలుత వేదికపైకి కొత్తూరి శ్రీనివాస్‌ను పిలవకపోవడంతో సమావేశంలో కొంత రసాభాసకు దారి తీసింది.



అ'ధర'హో

- అనూహ్యంగా పెరిగిన కొబ్బరి ధరలు
- వెయ్యి కాయ రూ.18వేల నుంచి రూ.20వేలు
- ఇతర రాష్ట్రాలకు ఎగుమతులే కారణం
- కొబ్బరి రైతుల్లో హర్షాతిరేకాలు

అయినవిల్లి, సెప్టెంబరు 24: కోనసీమ కొబ్బరికాయల ధరలు రెట్టింపుకుపైగా పెరిగాయి. శ్రావణమాసంలో వెయ్యి కాయలు రూ.9వేలు ధర ఉండగా ప్రస్తుతం వెయ్యి కొబ్బరికాయలు రూ.18వేల నుంచి రూ.20వేలకు చేరుకుంది. దసరా, దీపావళి, కార్తీకమాసం ముందు ఉన్నందున ధరలకు డోకాలేదని వ్యాపారవర్గాల వారు భావిస్తున్నారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో కొబ్బరికాయల ఉత్పత్తి గణనీయంగా తగ్గడం, దేశవ్యాప్తంగా కొబ్బరికాయలకు డిమాండ్ అనూహ్యంగా పెరగడంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయని వ్యాపారులు అంటున్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి కోనసీమలో కొబ్బరి రైతులు ధర లేక దిగుబడి రాక విలవిల్లాడారు. నల్ల తెగులు, తెల్లదోమ తెగులువల్ల ఎకరాకు 300 కాయలు దిగుబడి మాత్రమే వచ్చేది. ఉత్పత్తి వ్యయాలు పెరిగిపోయి గిట్టుబాటు కాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గతంలో కొబ్బరిలో అంతర పంటలైన కోకో, పోక సాగుకు ఉద్యానశాఖ రాయితీపై మొక్కలు అందించేవారు. వైసీపీ పాలనలో ఉద్యానశాఖ అంతర పంటల సాగు ప్రోత్సాహకాలు నిలిపివేశారు. దీంతో రైతులు కొబ్బరిపైనే ఆధారపడే పరిస్థితి నెలకొంది. కొబ్బరి ధరలు ఆశాజనకంగా ఉండడం వలన రూ.9వేల రేటులోనే వ్యాపారస్తులు రైతుల నుంచి కొబ్బరికాయలు సేకరించి నిల్వ ఉంచుకోవడం వలన రైతుల కన్నా వ్యాపారస్తులకే పెరిగిన ధరలు లాభించాయని రైతులు అంటున్నారు. ఎండుకొబ్బరి క్వింటాల్‌కు రూ.15,500, కొబ్బరినూనె కిలో రూ.320, వర్జీనియా కోకోనట్ ఆయిల్ కిలో రూ.500 ధరలు పెరిగాయి. పచ్చికొబ్బరికాయలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ముంబై, రాజస్థాన్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర, చత్తీస్‌గడ్, హర్యానా రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు కొబ్బరికాయలు కొనుగోలుకు కోనసీమ కేంద్రంగా చేసుకోవడంతో ధరలు పెరిగాయని వ్యాపారులంటున్నారు. సాధారణంగా బీహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, ఒడిశా తదితర రాష్ట్రాలకు ఒలిచిన కొబ్బరికాయలు ఎగుమతి అవుతాయి. ప్రస్తుతం కొబ్బరికాయలకు డిమాండులో ఒలుపు చేయని కాయలను కొనుగోలు చేస్తున్నారు. టన్ను రూ.50వేలు వంతున అమ్మకాలు జరుపుతున్నట్టు వ్యాపార వర్గాలు అంటున్నారు.



రికార్డు ధర.. ఏడేళ్ల తరువాత కొబ్బరికాయలకు రికార్డు స్థాయిలో ధర వచ్చింది. 2017లో కొబ్బరికాయలు రూ.15వేలు ధర పలుకగా 2024లో రూ.20వేలు ధర పలకడం విశేషం. మార్కెట్‌లో ఈ స్థాయి ధర రావడం అరుదని రైతులు, వ్యాపారులు అంటున్నారు. పచ్చికొబ్బరికాయలతో పాటు కొబ్బరి ఉత్పత్తుల ధరలు పెరిగాయి. పాత కురిడీకాయ గండేలా వెయ్యింటికీ రూ.14వేలు, గటగటా రూ.17,500, కురిడీ కొత్తకాయ గండేరా రూ.13వేలు, గటగటా రూ.15,500 ధరలు పలుకుతున్నాయి.

సబ్ రిజిస్ట్రార్ల బదిలీలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాష్ట్రంలోని సబ్-రిజిస్ట్రార్ల బదిలీల్లో భాగంగా జిల్లాలోని సబ్-రిజిస్ట్రార్ల అందరికీ స్థాన చలనం కల్పించింది. అయితే, ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. గరిష్ఠ కాల పరిమితితో సంబంధం లేకుండా బదిలీలు చేశారు. జిల్లాలోని సబ్-రిజిస్ట్రార్లు అందరూ ఆయా స్థానాల్లో నియమితులై సుమారు రెండేళ్లు మాత్రమే దాటింది. సాధారణంగా సబ్-రిజిస్ట్రార్లను మూడున్నరేళ్లు బదిలీ చేయరు. దీంతో మంచి స్థానాలు 'దక్కించుకున్న' వారు మినహా మిగతా వాళ్లు మనస్తాపం చెందుతున్నారు. రాజమహేంద్రవరం, కడియం, రాజానగరం, పిడింగొయ్యి స్థానాలకు 'ధర' ఎక్కువగానే పలికిందని ఉద్యోగ వర్గాల్లో చర్చనడుస్తోంది. ఈసారి యూ నియన్ల జోనల్ స్థాయి నాయకులను కూడా కూటమి ప్రభుత్వం బదిలీ చేసింది.

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
ఎం.రాజబాబు	రాజమహేంద్రవరం-1	నిడదవోలు
ఆర్.రాంబాబు	ముమ్మిడివరం	రాజమహేంద్రవరం-1
పుల్లంరాజు	వట్లూరు	రాజమహేంద్రవరం-2
సీహెచ్ శ్రీనివాసబాబు	కొత్తపేట	బిక్కవోలు
ఇ.లక్ష్మీ	సామర్లకోట	కడియం
కె.కమలప్రియ	రాజమహేంద్రవరం-2	అనపర్తి
త్రినాథ్	కంకిపాడు	పిడింగొయ్యి
వీవీఎస్‌బీ శ్రీనివాస్	భీమడోలు	కోరుకొండ
ఐహెచ్‌ఆర్‌కే ప్రసాద్	కోరుకొండ	సీతానగరం
కె.సుందరరావు	పిడింగొయ్యి	కొవ్వూరు
మోహన్	కొవ్వూరు	వేగేశ్వరపురం
వి.వెంకటేశ్వర్లు	నిడదవోలు	రాజానగరం
ఇ.వెంకటేశ్వరరావు	కొవ్వూరు	అనంతపల్లి

పునరావాస కమిషనర్‌కే పోలవరం అడ్మినిస్ట్రేటర్ బాధ్యతలు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

రంపచోడవరం, సెప్టెంబరు 24: పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా ప్రస్తుతం రాష్ట్ర పునరావాస కమిషనర్‌గా ఉన్న ఎస్.రామ సుందర్‌రెడ్డికే అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పోలవరం అడ్మినిస్ట్రేటర్ పోస్టు గత కొంతకాలంగా ఖాళీగానే ఉంది. ఈ పోస్టుకు రెగ్యులర్ అధికా రిని గత కొంతకాలంగా నియమించటంలేదు. పోలవరం అడ్మి నిస్ట్రేటర్ పోస్టుతో పోలవరం ప్రాజెక్టు పునరావాస అంశాలు, భూ సేకరణ, పరిహారాల చెల్లింపు అంశాలు ముడిపడి ఉండటం, ఈ అంశాలకు సంబంధించి గత కొంత కాలంగా అనేక ఆరోపణలు వస్తుండటంతో ఈ పోస్టుకు అక్రమాలను సైతం ధైర్యంగా వెలికి తీసే అధికారి కోసం ప్రభుత్వం వెతుకుతోంది. దీంతో అంతవరకూ ఈపోస్టుకు పునరావాస కమీసనర్‌నే అదనపు బాధ్యతగా నియమించింది.


పాములేరు వాగులో గాలిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

దొరకని మెడికో ఆచూకీ

- కొనసాగుతున్న గాలింపు చర్యలు
- డ్రోన్ కెమెరాతో జల్లెడ పడుతున్న అధికారులు

మారేడుమిల్లి, సెప్టెంబరు 24: అల్లూరిజిల్లా మారేడుమిల్లి జల తరంగిణిలో ఆదివారం కొట్టుకుపోయిన మెడికల్ విద్యార్థి చింతకుంట్ల హరదీప్ ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. ఆదివారం జరిగిన ఈ దుర్ఘటన అనంతరం సహాయక చర్యలు చేపట్టిన అధికారులు సోమవారం ఇద్దరు వైద్య విద్యార్థినుల మృతదేహాలను కనుగొన్న సంగతి తెలిసిందే. మరొక విద్యార్థి హరదీప్ ఆచూకీ కోసం మంగళవారం కూడా ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో కొండ వాగులు, కల్వర్టులు క్షుణ్ణంగా పరిశీలించారు. అయినప్పటికీ విద్యార్థి జాడ కన్పించక పోవడంతో రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి డ్రోన్ కెమెరాను వినియోగిస్తూ అనువనువునా జల్లెడ పడుతున్నారు. జలతరంగిణి నుంచి నీటి ప్రవాహం పలు కల్వర్టులు, దట్టమైన పొదలు మీదుగా ప్రవహిస్తూ పాములేరు వాగులోకి అక్కడి నుంచి గోదావరి నదిలోకి నీటి ప్రవాహం చేరుకొనే అవకాశం ఉండడంతో ఆదిశగా గాలింపు చర్యలను పోలీసు అధికారులు ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా ఎన్‌డీఆర్‌ఎఫ్‌తో పాటు ప్రత్యేక బృందం డ్రోన్ కెమెరా సాయంతో పాములేరు వాగులో కొన్ని కిలోమీటర్ల మేర గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం బాగా చీకటిపడడంతో పాములేరు వాగు ప్రమాదకరంగా ఉండడంతో తిరిగి బుధవారం ఈ గాలింపు చర్యలను ముమ్మరం చేయనున్నట్టు అధికారులు చెబుతున్నారు. సబ్‌కలెక్టరు కల్పశ్రీ, తహశీల్దారు సుబ్బారావు, సీఐ మురళీకృష్ణ గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు.


డ్రోన్ కెమెరా వినియోగాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ జగదీష్ అడహళ్లి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి


ఆలమూరు మండలం చొప్పెల్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం

- బొలెరో వ్యాన్‌ను బైక్‌తో ఢీకొని అక్కడికక్కడే మృత్యువాత
- మృతులు చొప్పెల్ల, దుళ్ల వాసులు

అలమూరు, సెప్టెంబరు 24: ఆగి ఉన్న బొలెరో చేపల వ్యాన్‌ను బైక్‌తో వచ్చి ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఇరువురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ వద్ద జాతీయరహదారిపై మంగళవారం రావులపాలెం నుంచి పాత బ్రిడ్జి మీదుగా వస్తున్న మత్స్యకారుల చేప ల వ్యాన్ ఏటిగట్టు నుంచి కపిలేశ్వరపురం వెళ్లేందుకు ఆగుతుండగా అదే దారిలో బైక్ వస్తున్న ఆలమూరు మండలం చొప్పెల్లకు చెందిన వానపల్లి రాజేష్(30), కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన వేగిరాజు సీతారామరాజు(36) ఆగుతున్న వ్యాన్‌ను గుర్తించకపోవడంతో వెనుక నుంచి బలంగా ఢీకొన్నారు. దీంతో వారు ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. ఇంత భారీ ప్రమాదం జరిగి ఇరువురు మృతి చెందిన వారిలో ఒకరికి కూడా కనీసం గాయం కాకుండా మృత్యువాత పడటం ఆశ్చర్యం కలిగిస్తుంది. వెల్డింగ్ సామాన్లు కొనుగోలు చేయడానికి రావులపాలెం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి బంధువుల ఫిర్యాదు మేరకు ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయాం


వానపల్లి రాజేష్ (ఫైల్)

జొన్నాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వానపల్లి రాజేష్(30) వయస్సుకు చిన్నవాడే అయినప్పటికీ కుటుంబానికి ఆయన దిక్కు. చొప్పెల్ల గ్రామనివాసి అయిన రాజేష్ చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. దీంతో కుటుంబ భారం ఆయన తీసుకుని సోదరి వివాహంచేశారు.అవివాహితుడైన రాజేష్ తల్లికి పెద్ద దిక్కుగా ఉన్నాడు. రాజేష్ ఇటుకబట్టీ నిర్వహిస్తున్నాడు. కుటుంబ పెద్దదిక్కు కోల్పోవడంతో తల్లి కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది.

దుళ్లలో విషాదఛాయలు


వి. సీతారామరాజు(ఫైల్)

కడియం: జొన్నాడవద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన వేగిరాజు సీతారామరాజు (36) మృత్యువాత పడ్డాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సీతారామరాజుకు భార్య కోటేశ్వరి, 12ఏళ్ల కొడుకు షణ్ముఖ చైతన్య, 8ఏళ్ల కుమార్తె సాయికృష్ణ తేజస్విని ఉన్నారు. సీతారామరాజు తండ్రి సోలోమాన్‌రాజు డయాలసిస్ పెషెంట్. రెండు రోజులకొకసారి డయాలసిస్ చేయించాల్సిన పరిస్థితి. సీతారామరాజు వెల్డింగ్‌పని చేస్తూ ఆ కుటుంబానికి జీవనాధారంగా నిలిచాడు. ఇంటికి ఆధారమైన కొడుకు చనిపోడంతో ఆ కుటుంబం రోదన వర్ణనాతీతం. సీతారామరాజు కుటుంబాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కూటమి నాయకులు చిట్టూరి అమ్మిరాజు, గుర్రపు సత్యనారాయణ, దేవినాగేశ్వరరావు, కంటిపూడి శ్రీను, సత్యనారాయణ, గోపి ప్రసాద్, రాజు పరామర్శించారు.

గిరిజన సంక్షేమశాఖ ఈఈగా శ్రీనివాసరావు



రంపచోడవరం, సెప్టెంబరు 24: రంపచోడవరం గిరిజన సంక్షేమశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఐ.శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ 1985లో గిరిజన సంక్షేమశాఖలో జాయిన్ అయ్యానని, వివిధ హోదాలో పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చానన్నారు. ఏజెన్సీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

సహ ఉద్యోగి నుంచి వేధింపులపై ఉద్యోగిని ఫిర్యాదు


మాట్లాడుతున్న ఉద్యోగిని

కాకినాడ సిటీ, సెప్టెంబరు 24: తాను పనిచేసే కార్యాలయంలో సహ ఉద్యోగి నుంచి లైంగిక వేధింపులు అధికమయ్యాయని, ఇంట్లో ఎవరూ లేనప్పుడు చెప్పు వస్తానంటున్నాడని కాకినాడ ఉమెన్ అండ్ చైల్డ్ డిపార్ట్‌మెంట్ డీసీపీ యూనిట్ మహిళా ఉద్యోగిని ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక డాల్ఫిన్ కాలనీలోని బీజేపీ సీనియర్ నాయకుడు యెనిమిరెడ్డి మాలకొండయ్య నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో బాధితురాలు తన భర్తతో కలిసి మాట్లాడారు. తాను ఉద్యోగంలో చేరిన కొద్దిరోజుల్లోనే సహ ఉద్యోగి నుంచి లైంగిక వేధింపులు మొదలయ్యాయన్నారు. విషయం తెలుసుకుని పీడీ అడిగితే రాతపూర్వకంగా ఫిర్యాదు చేశానని, తర్వాత కలెక్టర్‌కు, ఎస్పీకి, సీఐకి ఫిర్యాదు చేశానన్నారు. దీంతో పీడీ పిలిచి నీకు ఇష్టం ఉంటే చేయి లేకపోతే ఉద్యోగం మానేయమని ఇబ్బంది పెడుతున్నారన్నా రు. ఉమెన్ అండ్ చైల్డ్ డిపార్ట్‌మెంట్‌లోనే ఈ విధంగా జరిగితే తాను ఎవరికి చెప్పుకోవాలని, తనకు న్యాయం చేయాలని బాధితు రాలు కోరారు.

దేశ అంతర్గత రక్షణకు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ దిక్సూచి

- 'నన్నయ' ఉప కులపతి ఆచార్య శ్రీనివాసరావు


పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 24: త్రివిధ దళాలు దేశ సరిహద్దులో రక్షణ కవచంగా ఉంటే ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ దేశ అంతర్గత రక్షణకు, భవిష్యత్‌కు దిక్సూచిగా నిలుస్తాయని ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో వెస్ట్‌జోన్ ఎన్‌సీసీ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరం ఎంపికలను మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ వివిధ స్థాయిల్లో జరిగే ఎంపికల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి వచ్చే ఏడాది జనవరి 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవంలో నన్నయ విశ్వ విద్యాలయ ఔన్నత్యానికి చిహ్నాలుగా నిలవాలన్నారు. విద్యతో పాటు సమాజహితమైన కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఎన్ఎస్ఎస్ రాష్ట్ర యువజన అధికారి ఎం.సైదా మాట్లాడుతూ ఈ శిబిరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రీ రిపబ్లిక్ డే శిబిరానికి ఎంపిక చేస్తామన్నారు. అందులో ప్రతిభావంతులైన వారిని ఢిల్లీ శిబిరానికి ఎంపిక చేస్తామని తెలిపారు. ప్రతిభావంతులను ఎంపిక చేయడానికి ఏఏ అంశాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారో వివరించారు. మంగళవారం జరిగిన ఎంపికలకు ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి 155 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు హాజరయ్యారు. ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వీసీ మొక్కను నాటారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం వసూలు చేసిన రూ.30వేల చెక్కును ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎన్ఎస్ఎస్ పీవో పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గోదావరిలో వ్యక్తి గల్లంతు

రోడ్డు కం రైలు బ్రిడ్జి పైనుంచి దూకి

- భీమవరానికి చెందిన వ్యక్తిగా గుర్తింపు

కొవ్వూరు, సెప్టెంబర్ 24: కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకి వ్యక్తి గల్లంతయ్యాడు. మంగళవారం సాయంత్రం కొవ్వూరు, రాజమహేంద్రవరంల మధ్య గోదావరిపై ఉన్న రోడ్డు కం రైలు బ్రిడ్జి 127వ స్తంభం వద్ద బైక్‌ను పార్క్‌చేసి ఒక వ్యక్తి గోదావరిలో దూకి గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న కొవ్వూరు పట్టణ ఏఎస్ఐ జి.జిప్రకాష్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బైక్‌ను పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బైక్ పై భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్టిక్కర్ అంటించి ఉండడం, నంబరు ప్లేట్ ఆధా రంగా భీమవరం వ్యక్తిగా గుర్తించి భీమవరం పోలీసులకు సమాచారం అందించారు. గల్లంతైన వ్యక్తి భీమవరం మోటుపల్లి వీధికి చెందిన కార్పెంటరీ వర్కర్ నాయుడు సుబ్రహ్మణ్యంగా గుర్తించారు. బంధువులు అందించిన ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు. గల్లంతయిన సుబ్రహ్మణ్యం కోసం గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు.

త్రుటిలో తప్పిన ఘోర బస్సు ప్రమాదం



రెండవవైపు రోడ్డులో పాకలోకి దూసుకు వెళ్లిన ట్రావెల్ బస్సు

తొండంగి,సెప్టెంబరు 24: ఘోర బస్సు ప్రమాదం త్రుటిలో తప్పడంతో దానిలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న ట్రావెల్ బస్సు మంగళవారం తెల్లవారు జామున కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి వచ్చే సమయానికి టైర్ పంచర్ పడింది. దీంతో అది అదుపుతప్పి డివైడర్ మీదుగా దూసుకుంటూ రెండవ వైపు రోడ్డులోకి ప్రవేశించి అక్కడ ఉన్న పాకలోకి వెళ్లి ఆగింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బస్సు ఇవతలి రోడ్డులోకి దూసుకు వచ్చే సమయానికి అటువైపుగా ఏదైనా వాహనం వచ్చి ఉంటే ఘోర ప్రమాదం జరిగేది. బస్సులో సుమారు 40మంది ప్రయాణికులు ఉన్నారు. ఏమి జరిగిందో అర్థంకాక వారంతా ఆందోళనకు గురయ్యారు. ప్రమాదం తప్పిన తీరు తెలుసుకుని తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డ సంఘటనను తలచుకుని భయాందోళనకు గురయ్యారు.

నెయ్యి కొనుగోలు

అన్నవరంలో రివర్స్ టెండరింగ్ ద్వారా

- ఆంధ్రజ్యోతి కథనంపై దేవస్థానం అధికారుల వివరణ
- సింహాచలంలో కిలో నెయ్యి రూ.385.41కు, అన్నవరం దేవస్థానంలో 538.60

అన్నవరం, సెప్టెంబరు 24: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో నెయ్యి కొనుగోలుపై ఆంధ్రజ్యోతిలో అన్నవరం అవినీతి కథనంపై జిల్లా కలెక్టర్ వివరణ కోరడంతో మంగళవారం దేవస్థానం అధికారులు వివరణ ఇచ్చారు. అన్నవరం దేవస్థానంలో నెయ్యి కొనుగోలు ఈప్రొక్యూర్‌మెంట్, రివర్స్ టెండరింగ్ ద్వారా దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులకు లోబడి కొనుగోలు చేశామని వచ్చిన నెయ్యిని ఆక్యురేట్ ల్యాబ్ ద్వారా శాంపిల్స్ రిపోర్టు తీసుకుని సంతృప్తికరంగా ఉంటేనే బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. సింహాచలం దేవస్థానంలో లక్కవరంకు చెందిన రైతు డైరీ కిలో నెయ్యి రూ.385.41 కి టెండర్‌ద్వారా కొనుగోలు చేయగా అన్నవరం దేవస్థానంలో అదేసంస్థ రూ.538.60కి కోడ్ చేసిందని పేర్కొన్నారు. అన్నవరందేవస్థానంలో నాణ్యమైన నెయ్యిని వాడుతున్నామని, ఇటీవల స్వామివారి ప్రసాదానికి కేంద్రప్రభుత్వం నాణ్యత పరిశీలిం చి ఎఫ్ఎస్ఎస్ఏఐ ధృవీకరణపత్రం అందజేసిందని వివరణ ఇచ్చారు.

నవోదయాలో ప్రవేశానికి దరఖాస్తుల గడువు పెంపు

పెద్దాపురం, సెప్టెంబరు 24: జవహర్ నవోదయా విద్యాలయాలో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును మరోసారి పెంచినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య తెలిపారు. నవోదయా విద్యాలయ సమితి ఆదేశాల మేరకు వచ్చేనెల 7వ తేదీ వరకు గడువును పొడిగించినట్లు తెలిపారు. ప్రవేశపరీక్ష 18.1.2025న జరుగు తుందని, వచ్చేనెల 8, 9 తేదీల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సవరణలు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

మండపేట, సెప్టెంబరు 24: పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను అత్యాచారం చేసిన యువకుడిపై మంగళవారం మండ పేట రూరల్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. మండపేట రూరల్ ఎస్ఐ సురేష్‌బా బు తెలిపిన వివరాల ప్రకారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మండపేట మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక రాజమహేంద్ర వరంలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. బాలికను ప్రేమిస్తున్నానని రాజానగరం మండలం తుంగపాడుకు చెందిన యువకుడు సతీష్ సోమవారం బైక్‌పై తీసుకువెళ్లి అత్యాచారా నికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదుపై ఆ యువకుడిపై మంగళవారం మండ పేట రూరల్ సీఐ పీతల దొరరాజు ఆధ్వర్యంలో పోక్సో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ హరికోటి శాస్త్రి తెలిపారు.

కడియంలో చిరుతపులి సంచారం

- పాదముద్రలు పరిశీలించిన అటవీశాఖ అధికారులు
- అవి పులివేనని నిర్ధారణ.. స్థానికుల్లో భయాందోళన


పులి అడుగుజాడలు

కడియం, సెప్టెంబరు 24: కడియం- వీరవరం రోడ్డులో జీఎస్ఆర్ ఫంక్షన్‌హాలు వెనుక ఓ పొలంలో మంగళవారం చిరుతపులి సంచారం చేస్తుందనే వార్త కడియం మండల ప్రజలను భయాందోళనలకు గురిచేసింది. జీఎస్ఆర్ వెనుక ఉన్న నర్సరీలో కడియపులంకకు చెందిన మధు అనే రైతు పులినిచూసి భయాందోళనలకు గురి అవ్వడంతో పాటు పరుగులు తీసాడు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందడంతో అటవీశాఖ జిల్లా అధికారి భరణి ఆదేశాల మేరకు హుటాహుటిన అటవీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని అవి చిరుతపులి పాదముద్రలుగా నిర్ధారించారు. కదలికలను పరిశీలిస్తున్నారు. విషయం బయటకు రావడంతో అటవీశాఖ అధికారులు కడియం చేరుకున్నారు. ప్రజలు గుంపులు గుంపులుగా వెళ్లాలని, రాత్రి సమయంలో బయటకు రావద్దని చెబుతున్నారు. కడియపులంక గ్రామం లో దోసాలమ్మకాలనీ ప్రజలు భయంతో వణికిపోతున్నారు. టార్చ్‌లైట్లు పట్టుకుని కేకలు వేసుకుంటూ తిరుగుతున్నారు. నర్సరీ కార్మికులు ఎవరూ బుధవారం పనుల్లోకి రావద్దని సెలవు ప్రకటించినట్టు నర్సరీరైతులు చెబుతున్నారు. మొక్కల ఎగుమతులతోపాటు నర్సరీల్లో ఎటువంటి పనులు ఉండవని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాత్రి సమయంలో ఒంటరిగా రాకూడదని చిన్నపిల్లలను బయటకు తీసుకు రావద్దు అని, ఇంటి ఆరు బయట లైట్లు వేసుకుని ఉంచాలని హెచ్చరిస్తున్నారు. ప్రతీ ఆలయంవద్ద మైకులు సౌండ్ పెట్టాలని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. నర్సరీ ప్రాంతం కావడంతో ఏ మొక్కల మధ్య పులి ఉందో? అని నర్సరీ రైతులు, కార్మికులు భయంతో వణికిపోతున్నారు.

దివాన్ చెరువులో మూడు రోజులుగా జాడ లేదు

దివాన్‌చెరువు ప్రాంతంలో మూడు రోజులుగా చిరుత జాడ లేకపోవడం, మంగళవారం రాత్రి నర్సరీ ప్రాంతంలో కనిపించడం అటవీశాఖ అధికారులు పులి జాడలే అని నిర్ధారించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పులి ఈ ప్రాంతం నుంచి ఎక్కడికి వెళ్లిందనేది అంతు పట్టడం లేదు. నర్సరీలో సీసీ కేమేరాలు ఉంటాయి. రైతులు నర్సరీల్లో ఉండటానికి సాహసించడం లేదు. గంటకు 100 కిలోమీటర్ల వేగం కంటే ఎక్కువగా పయనించే ఈ చిరుత నర్సరీల్లో ఉందా ? అక్కడి నుంచి సమీపంలో ఉన్న మండపేట, ఆలమూరు మండలాల వైపు వెళ్లిందా? లేక కడియంలోనే ఉందా ? అనేది చర్చాంశనీయంగా మారింది.

రెవెన్యూ వర్సెస్ ఫారెస్టు

- చూచిరేవుల భూముల్లో ఇరుశాఖల మధ్య వివాదం
- రిజర్వు ఫారెస్టులో కార్పొరేట్ వ్యవసాయం కుదరదంటూ వ్యవసాయ పనులను అడ్డుకున్న అటవీశాఖాధికారులు
- అవి రెవెన్యూ భూములంటూ రెవెన్యూ అధికారుల వాదన


అడవిలో సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ, ఫారెస్టు అధికారులు

కూనవరం, సెప్టెంబరు 24: అల్లూరిజిల్లా కూనవరం మండలంలోని పైడిగూడెం పరిధిలో చూచిరేవుల గ్రామానికి చెందిన గిరిజనులకు ప్రభుత్వం కొంత భూమి ఇచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన గిరిజన భూమి ఇప్పుడు రెవెన్యూ, అటవీ శాఖాధికారుల మధ్య వివాదంగా మారింది. ఈ భూములు మావంటే మావంటూ మంగళవారం ఆ ఇరు శాఖల అధికారులు సర్వే నిర్వహించుకున్నారు. మండల పరిధిలో చూచిరేవుల గ్రామస్తులకు ప్రభుత్వం సుమారు 200 ఎకరాలకుపైగా భూమిని గతంలో వారికి ఇచ్చినట్లు గిరిజనులు చెబుతున్నారు. ఆ భూములు తమవంటూ ఫారెస్టు అధికారులు రంగంలోకి దిగడంతో గిరిజనులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. 1970 నుంచి ఇప్పటివరకు చూచిరేవుల గిరిజనులు సజావుగానే వ్యవసాయం చేసుకుంటున్నారు. కౌలు పేరుతో వలస రైతులు ఆ భూముల్లోకి అడుగుపెట్టడంతో ఆ భూములు ఇప్పుడు ప్రస్తుతం వివాదంగా మారాయి. ఈ భూములు కంపార్టుమెంట్ 167 రిజర్వు ఫారెస్టు పరిధిలో ఉన్నాయని ఈ భూముల్లో కార్పొరేట్ వ్యవసాయం కుదరదని అక్కడ జరుగుతున్న వ్యవసాయ పనులు అటవీశాఖాధికారులు అడ్డుకున్నారు. ఆదేశాలు వచ్చేవరకు ఈ భూముల్లో వ్యవసాయం నిర్వహించవద్దన్నారు. దీంతో భూ యజమానులైన గిరిజనులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో మంగళవారం అటవీశాఖ, రెవెన్యూ అధికారుల సమక్షంలో సర్వే నిర్వహించారు. సర్వే నెం. 123 ప్రకారం ఈ భూములు తమవేనంటూ రెవెన్యూ అధికారులు ఫారెస్టు అధికారులకు తెలియజేశారు. 1984 గెజిట్ ప్రకారం ఈ భూములు తమ రిజర్వు ఫారెస్టు ఆధీనంలో ఉన్నాయని అటవీశాఖాధికారిణి మోహిణి విజయలక్ష్మి అక్కడ రెవెన్యూ అధికారులకు తెలిపారు. ఇవి మావంటే మావంటూ ఇరు అధికారులు వాదించుకోవడంతో చివరకు ఈసమస్య కొలిక్కిరాలేదు. ఈవిషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను అక్కడే పరిష్కరించుకోవాలని ఇరుశాఖల అధికారులు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తాము ఎప్పటి నుంచో సాగు చేసుకుంటున్న భూమిపై పూర్తి హక్కులు కల్పించాలని చూచిరేవుల గిరిజనులు కోరుతున్నారు. గిరిజనులు స్వతహాగా వ్యవసాయం చేసుకుంటే తమకు అభ్యంతరంలేదని అటవీ జంతువులు తిరిగే ఈ ప్రదేశంలో విషపూరిత మందులతో వ్యవసాయం చేస్తే అటవీ జంతువులకు హాని కలిగే ప్రమాదముందని అందుకే కార్పొరేట్ వ్యవసాయం చేయవద్దని చెబుతున్న ట్లు అటవీశాఖాధికారులు చెబుతున్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

•అమలాపురం •పి.గన్నవరం •రాజోలు •ముమ్మిడివరం •కొత్తపేట •మండపేట •రామచంద్రపురం

ఆటల పోటీలు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి

మలికిపురం, సెప్టెంబరు24: ఆటల పోటీలు విద్యార్థులకు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. బట్టేలంక హైస్కూలులో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, యోగా, చెస్, అథ్లెటిక్ విభాగాల్లో జరిగిన పోటీల్లో నాలుగు మండలాల నుంచి 600మంది క్రీడాకారులు, 40 మంది వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు. విజేతలు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాస్థాయిలో జరిగే పోటీలకు ఎంపికవుతారన్నారు.

బాబు, పవన్ సారథ్యంలో అభివృద్ధి దిశగా రాష్ట్రం







మండపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మామిడికుదురు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, రావులపాలెం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

మండపేట, సెప్టెంబరు 24: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ద్వారపూడి పంచాయతీ వద్ద మంగళవారం సర్పంచ్ ఈతకోట కిన్నెన అధ్యక్షతన జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. త్వరలోనే మహిళలకు ఉచితబస్ ప్రయాణం, ఉచితంగా మూడు వంట గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్నారు. ద్వారపూడి మాజీ సర్పంచ్, జనసేన పిఠాపురం నియోజవ కర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. నేతలు పొలంబడి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నల్లమిల్లి వీర్రెడ్డి, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు సత్తి సత్యనారాయణ, జనసేన గ్రామశాఖ అధ్యక్షుడు చింతా దొరబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి, మండా వీరభద్రరావు, గోణం పుల్లయ్య, సుంకర నాని, చేకూరి రమేష్ రాజు, టి.మురళీ కృష్ణ, సలాది, బాలసుబ్రహ్మణ్యం, ఎంపీడీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఆకులు వెంకటరమణ, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు పిల్లి మీనా, గ్రామప్రత్యేకాధికారి అజీజ్, ఎంఈవో నాయుడు రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాగ్యరాజ్, అధికారులు, కూటమి నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

అయినవిల్లి, సెప్టెంబరు 24: రాష్ట్రంలో వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలన ప్రజారంజకంగా సాగిందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మంగళవారం విలస గ్రామంలో సర్పంచ్ కుసుమ లిల్లీమంగేష్కర్ అధ్యక్షతన జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వంద రోజుల్లో అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు, పోలవరానికి రూ.12వేల కోట్లు, పెన్షన్ల పెంపు వంటివి సాధించామన్నారు. ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, మద్దాల సుబ్బారావు, చిట్టూరి శ్రీనివాస్, పోలిశెట్టి రాజేష్, నేదునూరి వీర్రాజు, అక్కిశెట్టి దుర్గారావు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి

మామిడికుదురు, సెప్టెంబరు 24: నియోజకవర్గంలో దీర్ఘకాలంగా ఉన్న అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఈదరాడలో మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రధానంగా ఉన్న మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎంపీపీ కె.వనజాకుమారి, సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, నాయకులు బోనం బాబు, యెరుబండి లక్ష్మయ్య, చిక్కం రాంబాబు, వర్థినేని వెంకట్రామయ్య గుండుబోగుల పెదకాపు, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వం

కాట్రేనికోన, సెప్టెంబరు 24: గెద్దనపల్లిలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం, స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు జరిగాయి. రామాలయంవీధి, కాల్వగట్టు ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దంతులూరి సీతారామకృష్ణంరాజు, ఉపసర్పంచ్ పట్టా లక్ష్మణ్, పి.రంగరాజు, పి.భాస్కరరాజు, మాజీ సర్పంచ్ గిడ్డి నాగరాజు, విద్యాకమిటీ చైర్మన్ సీహెచ్ లోవరాజు, యూనిట్ ఇన్‌చార్జి గోడి వెంకటరావు, పి.నారాయణరావు, జనసేన నాయకులు లక్ష్మీసుబ్బారావు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

రావులపాలెం, సెప్టెంబరు 24: వైసీపీ పాలనలో తీవ్ర నష్టాలు ఎదుర్కొన్న రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చెప్పారు. కొమరాజులంకలో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల, అన్నక్యాంటీన్లను ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గుత్తుల పట్టాభిరామారావు, చిలువూరి సతీష్‌రాజు, జక్కంపూడి వెంకటస్వామి, గుర్రాల నాగభూషణం, తోట స్వామి, గుర్రాల సుబ్బారాయుడుతో పాటు కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

రాబోయే రోజులు మహిళలకు పండగే

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 24: వంద రోజుల చంద్రబాబు పాలనలో రాష్ట్ర ప్రజలకు ఎంతో మంచి జరిగిందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. రాబోయే వంద రోజుల్లో ఉచిత బస్సు, ఉచిత వంటగ్యాస్, ఖాతాల్లోకి నగదు జమ వంటి పథకాల అమలుతో మహిళలకు పండగేనని ఆయన వ్యాఖ్యానించారు. చల్లపల్లి పంచాయతీ చింతలచెరువులో మంగళవారం టీడీపీ గ్రామకమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, బూసి బుజ్జిదొర ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, సర్పంచ్ ఇసుకపట్ల జయమణిరఘుబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, కూటమి నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, పెచ్చెట్టి చంద్రమౌళి, పోలిశెట్టి శివాజీ, గొలకోటి చిన్నా, యరగర్త వెంకటేశ్వరరావు, దంగేటి బాబులు, దంగేటి రవీంద్రనాథ్, అడపా అవినాష్, యాళ్ల సత్తిబాబు, చీకట్ల నానిపాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం

ముమ్మిడివరం, సెప్టెంబరు 24: అనాతవరం, కొత్తలంక, నగర పంచాయతీ పరిధిలోని క్రాప చింతలపూడి గ్రామాల్లో మంగళవారం ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించారు. అనాతవరంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కురసాల శివబాబు ఆధ్వర్యంలో అనాతవరం మెయిన్ సెంటర్, చాకిరేవుపేట, దంగేటివారిపాలెం ప్రాంతాల్లో సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి వంద రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మిమ్మితి చిరంజీవి, పేరిచర్ల సురేష్‌రాజు, గుబ్బల తాతబ్బాయి, వాసంశెట్టి పట్టాభిరామయ్య, పెయ్యల రమణ, కుంచే శ్రీను, అందే శ్రీను, మట్టపర్తి రాంబాబు, మట్టపర్తి ఈశ్వరి, గంధం శ్రీను, సలాది అర్జున్, పెంటపాటి సూరిబాబు పాల్గొన్నారు. అలాగే నగర పంచాయతీ పరిధిలోని క్రాపచింతలపూడి 15వ వార్డు పరిధిలో కౌన్సిలర్ మాదాల నాగసత్యమంగకుమారి ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. దొమ్మేటి రమణకుమార్, గొల్లపల్లి గోపి, మాదాల పరంకుశం, ఏడిద శివ, మాదాల బుజ్జి, మాదాల శ్రీధర్, రామాయణం రాజు పాల్గొన్నారు. కొత్తలంక గ్రామంలో ఎన్డీఏ కూటమి నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామంలో వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో దూడల స్వామి, గీసాల చంద్రరావు, వీపూరి నాగరాజువర్మ, కొడమర్తి వెంకటరత్నశర్మ, మట్టా గోవిందు, వంగా బాబులు, కుచ్చర్లపాటి చిట్టిరాజు, సామంతకుర్తి సుబ్బారావు, దువ్వూరి భాస్కర రాంబాబు, బొక్కా త్రినాథ్ పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూ ప్రసాద నాణ్యతను కాపాడాలి



అంబాజీపేట సెంటర్‌లో హిందూ ధర్మరక్షణ సమితి సభ్యుల నిరసన

అంబాజీపేట, సెప్టెంబరు 24: తిరుపతి దేవస్థానంలో శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యిని వాడిన వారందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అంబాజీపేట హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక సెంటర్ వద్ద నిరసన తెలిపారు. దీనికి బాధ్యులుగా అప్పటి సీఎం జగన్, టీటీడీ చైర్మన్, ఈవోలపై కేసులు నమోదుచేసి చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక సెంటర్ నుంచి బస్టాండ్ వరకు గోవిందనామస్మరణతో ర్యాలీ నిర్వహించారు. హిందూ ధర్మరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో నిరసన ర్యాలీ

ముమ్మిడివరం, సెప్టెంబరు 24: వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం అపచారంపై భారతీ పురోహిత సంక్షేమ సమైక్య, హిందూ సంఘాల ఆధ్వర్యంలో కూటమి నాయకులతో కలిసి ముమ్మిడివరంలో శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయం సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. కల్తీ నెయ్యి కారకులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. తహసీల్దార్ ఎం.సుబ్బలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆకొండి రామకృష్ణ, మంత్రిప్రగడ వెంకటకృష్ణారావు, నడిమింటి సూర్యభాస్కరం, కొంపెల్ల సుబ్రహ్మణ్యచైన్లు, విళ్ల వీరాస్వామినాయుడు, కొయ్యల దుర్గారావు, కాజులూరి రామలింగేశ్వరరావు, నాగాబత్తుల రవిశర్మ, ఆకొండి మహేష్, కొడమర్తి శర్మ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి కార్యకర్తల ర్యాలీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 24: తిరుపతి లడ్డూ అపవిత్రంపై మంగళవారం కూటమి నాయకులు రామచంద్రపురంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద బైక్ ర్యాలీని టీడీపీ నాయకుడు వాసంశెట్టి సత్యం జెండా ఊపి ప్రారంభించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు హౌసింగ్‌బోర్డు వెంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకుని స్వామికి వినతిపత్రం సమర్పించారు.అనంతరం డీఎస్పీ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, మాజీ కౌన్సిలర్లు అల్లం శ్రీనివాస్, దంగేటి గౌరీశంకర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కట్టా నాగేశ్వరరావు, లకాని పద్మకమలకుమారి, నారపురెడ్డి బలరామ్, కవల నానాజీ, అక్కల ఠాగూర్, బీజేపీ నాయకులు కొట్టువాడ హరిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

29న బాల్‌బ్యాడ్మింటన్ జట్ల ఎంపికలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 24: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జూనియర్ బాల బాలికల బాల్‌బ్యాడ్మింటన్ జట్లు ఎంపిక ఈనెల29న ఉదయం 9గంటలకు రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడాప్రాంగణంలో జరుగుతుందని జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముప్పన వీరభద్రస్వామి, కార్యదర్శి ఓలేటి సీతాపతి తెలిపారు. 2205 జనవరి 2న తరువాత పుట్టిన బాలబాలికలు ఈపోటీలకు అర్హులన్నారు. ఆసక్తిగల వారు పుట్టిన తేదీ ధ్రువపత్రం, ఆధార్ కార్డు, డ్రెస్ కోడ్‌తో హాజరు కావాలన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.1,05,116 విరాళం

ఆత్రేయపురం, సెప్టెంబరు 24: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రావులపాలానికి చెందిన కఠారి రంగరాజు రూ.1,05,116 విరాళం సమర్పించారు. మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు.

విద్యార్థులు ఏకాగ్రతతో విద్యనభ్యసించాలి

రావులపాలెం, సెప్టెంబరు24: విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనుకాకుండా ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలని రావులపాలెం టౌన్‌సీఐ జేమ్సురత్నప్రసాద్ అన్నారు. వెదిరేశ్వరం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పోక్సో చట్టంపై సీఐ అవగాహన కల్పించారు. స్కూల్‌చైర్మన్లు బడుగు సుబ్బాయమ్మ, కోట సోమేష్, ఎంపీటీసీ గంటా సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి ఎం.సాయిరామ్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉండి ఎమ్మెల్యేను అరెస్టు చేయాలని నిరసన

మామిడికుదురు, సెప్టెంబరు 24: గెద్దాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీ చింపిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును వెంటనే అరెస్టు చేయాలంటూ దళిత జేఏసీ నాయకులు డిమాండుచేస్తూ నిరసన చేపట్టారు. గ్రామంలో ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బత్తుల మురళీకృష్ణ, కొల్లాబత్తుల సతీష్, చింతా రాజబాబు, గుబ్బల నాగరాజు, విప్పర్తి మహేష్, కుసుమ గణేష్, మందపాటి మధు పాల్గొన్నారు.

అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 24: అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, కాకినాడలో వైద్యుని అవమానించిన జనసేన ఎమ్మెల్యే కందుల దుర్గేష్‌లపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. ఉప్పలగుప్తం అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో మంగళవారం మండలంలోని దళిత సంఘాల ప్రతినిధులు సమావేశమై ప్రభుత్వం స్పందించకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, కుంచే రమణారావు, కడిమి చిన్నవరాజు, పినిపే జయరాజ్, ఊటాల రామాంజనేయులు,కుంచే బాబులు, సాదే శ్రీనివాసరావు, నడింపల్లి సుబ్బరాజు, కాత్రు కృష్ణ, పి.వెంకటేశ్వరరావు, దేవరపల్లి రాంబాబు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి

ముమ్మిడివరం, సెప్టెంబరు 24: విద్యుదాఘాతానికి గురై ఐ.పోలవరం మండలం పశువుల్లంక అంబటివారిపేటకు చెందిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి మోర్త సాయిరామ్(42) మృతి చెందాడు. అన్నంపల్లి టోల్‌గేటు వద్ద టోల్‌గేటుకు ఎగువ భాగంలో మురమళ్ల సబ్‌స్టేషన్ నుంచి, దిగువ భాగాన ముమ్మిడివరం సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. అయితే వరదల సమయంలో విద్యుత్ సరఫరా సబ్‌స్టేషన్ పరిధి మార్పు చేశారు. విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా పొరపాటున మురమళ్ల సబ్‌స్టేషన్ పరిధిలో సరఫరాను నిలిపివేసి సాయిరామ్ పనులు చేపట్టారు. ఆ సమయంలో ముమ్మిడివరం సబ్‌స్టేషన్ నుంచి అక్కడ విద్యుత్ సరఫరా జరగడంతో విద్యుదాఘాతానికి గురై సాయిరామ్ మృతి చెందాడని ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈప్రమాదం సంభవించిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేపట్టారు.

పొలం పిలుస్తోంది

అంతర్వేది, సెప్టెంబరు 24: మోరి, మోరిపోడు గ్రామ సచివాలయాల వద్ద వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందేందుకు అనుసరించే పద్ధతులను రైతులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు ముప్పర్తి అలివేలుగంగాత్రివేణి, పసలపూడి లక్ష్మీపద్మమంగతాయారు, ఎంపీటీసీ జాన లక్ష్మీదుర్గాసూర్యావతి, బళ్ల సుభాషిణి స్థానిక వ్యవసాయ రైతులు, సచివాలయ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మలికిపురం మండలం మేడిచర్లపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగంతో అనుసంధానం చేయాలని, సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు ఇవ్వాలని రైతులు కోరినట్టు వ్యవసాయాధికారి ఎస్.రాకేష్ తెలిపారు.

కాటన్ బ్యారేజీ రహదారికి మోక్షం

ఎమ్మెల్యే బండారు చొరవతో నిధులు మంజూరు

ఆత్రేయపురం, సెప్టెంబరు 24: కాటన్ బ్యారేజీ రోడ్డు మరమ్మతులకు ఎట్టకేలకు తొలి అడుగు పడింది. ఉభయగోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న కాటన్ బ్యారేజీపై రహదారి ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా బ్యారేజీ రహదారి అధ్వాన స్థితికి చేరుకుంది. ఇటీవల కలెక్టర్ మహేష్ కుమార్ దృష్టికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఈసమస్యను తీసుకువెళ్లారు. కలెక్టర్ స్వయంగా బ్యారేజీని పరిశీలించి రూ.35 లక్షలు నిధులు మంజూరు చేశారు. మంగళవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు బ్యారేజీ మరమ్మతుల పనులకు శంకుస్థాపన చేశారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆకుల రామకృష్ణ, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, సర్పంచ్ నరాలశెట్టి



సుబ్బలక్ష్మి, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ముళ్లపూడి భాస్కరరావు, కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాథం, మాజీ సర్పంచ్ జల్లి కామేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, సెప్టెంబరు 24: కాకినాడకు చెందిన ముత్యాల రాంబాబు కుటుంబ సభ్యులు మురమళ్ల వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు మంగళవారం రూ.10,116 విరాళంగా అందించారు. ఆలయ పర్యవేక్షణాధికారి బి.వీరభద్రరావు వారికి స్వామివారి చిత్రపటం అందించారు.

శివారు ప్రాంతాలకు తాగునీరు

పి.గన్నవరం, సెప్టెంబరు 24: శివారు ప్రాంతాలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఆర్.ఏనుగుపల్లి, కె.ఏనుగుపల్లి గ్రామాల్లో వాటర్‌ట్యాంకుల ఏర్పాటుకు ఆయన భూమిపూజ చేశారు. ఆర్.ఏనుగుపల్లిలో రూ.28.70 లక్షలతో 30వేల లీటర్ల సామర్థ్యంతో వాటర్‌ట్యాంక్, కె.ఏనుగుపల్లిలో రూ.39.90లక్షలతో 2లక్షల లీటర్ల సామర్థ్యంతో సంపు, పైపులైన్ విస్తరణ పనులు జరుగుతాయన్నారు. కె.ఏనుగుపల్లిలో వాటర్‌సంపు నిర్మాణానికి నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబుతో కలిసి ఆయన భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కళ్యాణచక్రవర్తి, సర్పంచ్‌లు తోలేటి బంగారు నాయుడు, దొమ్మేటి పార్వతి, ఎంపీటీసీలు యాండ్ర విజయలక్ష్మి, కె.సూర్యనారాయణ, వాసంశెట్టి కుమార్, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, శేరు శ్రీనుబాబు, చీకట్ల అర్జునరావు, యాండ్ర శ్రీనివాసరావు, ప్రసన్నకుమార్, ఎస్.శేషయ్య, బి.సత్యనారాయణ, ఉండ్రాజవరపు ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గుచూపాలి

ద్రాక్షారామ, సెప్టెంబరు 24: రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం వెల్లలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒక రైతు పది ఎకరాలు సాగు చేస్తే అందులో కనీసం ఒక ఎకరంలోనైనా పకృతి వ్యవసాయం చేయాలని కోరారు. ప్రభుత్వం రైతుల కోసం సీఎల్ఎస్ యాప్ తీసుకువచ్చిందని, పంటల్లో పురుగులు, తెగుళ్ల ఫొటోలు టీసీ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే శాస్త్రవేత్తలు తగు సూచనలు ఇస్తారన్నారు. రైతు గ్రూపులకు కాకుండా వ్యక్తిగతంగా రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు ఇస్తామన్నారు. వ్యవసాయాధికారి సత్యప్రసాద్, వ్యవసాయ సహాయకులు, మాజీ సర్పంచ్ వట్టికూటి ఏసుబాబు పాల్గొన్నారు.

టిడ్కో గృహం, పింఛన్ అందిస్తాం

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన మంత్రి



రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 24: రామచంద్రపురం పెద్దవంతెన వద్ద సిమెంటు తూరలో పదేళ్లుగా నివసిస్తున్న నిరుపేద కుటుంబానికి టిడ్కో గృహం కేటాయిస్తామని మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రకటించారు. ఈనెల16న ఆంధ్రజ్యోతిలో గూడు లేని బతుకు శీర్షికన ప్రచురితమైన కథనానికి మంత్రి స్పందించారు. మంగళవారం సిమెంటు తూరలో నివసిస్తున్న మడిమి దుర్గారావు, దుర్గమ్మ వద్దకు మంత్రి వెళ్లి వారి స్థితిగతులు పరిశీలించారు. దుర్గారావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. రూ.5వేలు ఆ కుటుంబానికి అందజేశారు. టిడ్కో గృహం కేటాయిస్తామని, బధిర మహిళ దుర్గమ్మకు పింఛను మంజూరుచేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

1.56లక్షల ఎకరాల్లో ఈపంట నమోదు

అల్లవరం, సెప్టెంబరు 24: జిల్లాలో 1,57,900ఎకరాల్లో వరిసాగు జరగ్గా 1,56,446 ఎకరాల్లో ఈపంట నమోదు పూర్తయిందని, అందులో 1,32,900ఎకరాలకు రైతుల ఈకేవైసీ పూర్తయిందని జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు అన్నారు. గుడాల గ్రామంలో సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు అధ్యక్షతన పొలం పిలుస్తోంది సభలో మాట్లాడారు. వరి సాగులో సస్యరక్షణకు డ్రోన్‌లు ఉపయోగించాలని ప్రకృతి వ్యవసాయ సాగుపై దృష్టి సారించాలన్నారు. పశుసంవర్థకశాఖ అధికారి డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ మినీ గోకులం షెడ్ల నిర్మాణాల పథకం అందుబాటులో ఉందన్నారు. మండల వ్యవసాయాధికారి ఎన్వీవీ సత్యనారాయణ, ఎఫ్‌డీవో అశ్వనిసత్య, ఉపసర్పంచ్ పోలిశెట్టి వెంకటేశ్వరరావు, పంపిరెడ్డి కాశీ, పోలిశెట్టి భాస్కరరావు, బొలిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

రాయవరం, సెప్టెంబరు 24: రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ అండ్-14,17 విభాగాల్లో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు సోమవారం నిర్వహించారు. హెచ్ఎం వి.శాంతి సునీత, విద్యా కమిటీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను పాల్గొనాలన్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చెస్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో నియోజకవర్గం మూడు మండలాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్
శ్రీలలిత	ఉత్సాహం
శేఖర్ స్క్రీన్-1	కళింగ
శేఖర్ స్క్రీన్-2	ఆయ్
రమా	మత్తువదలరా-2
గణపతి	కమిటీ కుర్రోళ్లు
వెంకటపద్మావతిస్క్రీన్-1	సరిపోదా శనివారం
వెంకటపద్మావతి స్క్రీన్-2	గొర్రె పురాణం

వరద బాధితులకు రూ.5లక్షల విరాళం



కె.గంగవరం, సెప్టెంబరు 24: టీడీపీ సీనియర్ నాయకుడు, సత్యాస్కాన్ అధినేత డాక్టర్ కాదా వెంకటరమణ విజయవాడ వరద బాధితుల కోసం రూ.5లక్షల చెక్కును మంగళగిరిలో విద్యా శాఖ మంత్రి లోకేశ్‌కు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మెట్ల రమణబాబు, అక్కల రిశ్వంత్‌రాయ్, గంధం పళ్లంరాజు, దంగేటి గౌరీశంకర్, విత్తనాల వెంకట రమణ, కాకర్లపూడి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

కిటికీలు, గుమ్మాలు అమ్మకాలు నిలిపివేయాలి

అంబాజీపేట, సెప్టెంబరు 24: టింబర్ డిపోల్లో రెడిమేడ్ వేపరకం కిటికీలు, గుమ్మాలు, తలుపులు తయారు చేసి విక్రయించడం ద్వారా చేతివృత్తిదారులు, కార్పెంటర్లు ఉపాధి కోల్పోతున్నారని జిల్లా చేతివృత్తుల సంక్షేమ సేవా సంఘ జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణ మూర్తి తహసీల్దారుకు వినతిపత్రాన్ని అందించారు. డిపోల్లో భవన నిర్మాణ గృహోపకరణ వస్తువుల తయారీ, విక్రయాలు నిలుపుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పితాని బేబిరావు, గున్నేపల్లి భీమశంకర్, కేతా సోమేశ్వరరావు, కొవ్వూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

త్వరలో రూ.కోటితో ఎస్.యానాం బీచ్ అభివృద్ధి

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 24: తీరప్రాంత గ్రామం ఎస్.యానాంలో జాతీయ స్థాయిలో బీచ్ వాలీబాల్ పోటీల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రకటించారు. దీనికోసం త్వరలో రూ.కోటితో ఎస్.యానాం బీచ్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్ క్రీడామైదానంలో అల్లవరం, అమలాపురం, ఉప్పలగుప్తం మండలాల బాలురు, బాలికల నియోజకవర్గస్థాయి ఆటల పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. గొల్లవిల్లిలో జాతీయ వాలీబాల్ టోర్నమెంటు నిర్వహణకు ప్రణాళిక రూపొందిస్తున్నట్టు తెలిపారు. చదువే కాకుండా తమ పిల్లలు క్రీడలపై ఆసక్తి పెంచుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు సూచించారు. టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, మానే దుర్గారావు, కూనపరెడ్డి సత్యనారాయణ సహకారంతో నిర్వహిస్తున్న క్రీడా పోటీల కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ వాలా సత్యనారాయణ, హెచ్ఎం లంక రాణి, సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గాచిన్నా, జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, పాల్గొన్నారు.

మల్లాడి సవాల్‌కు గొల్లపల్లి సై!

యానాం, సెప్టెంబరు24: వచ్చే ఎన్నికల్లో యానాం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు వచ్చే ఎన్నికల్లో తనను ఓడిస్తానని లేకపోతే గుండు గీయించుకుంటానని చేసిన సవాల్‌ను స్వీకరిస్తున్నానని ఎమ్మెల్యే అన్నారు. ఎవరు ఓడిపోతారో, ఎవరు ఊరు వదిలి వెళ్లిపోతారో త్వరలో తేలనుందన్నారు. తనపై మల్లాడి చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. పేకాట క్లబ్‌లతో, హెచ్ఆర్ స్కైర్ సంస్థతో తనకు ఎలాంటి సంబంధాలు లేవన్నారు. మూడేళ్లుగా యానాంలో ఎటువంటి అభివృద్ధి జరగకుండా మల్లాడి అడ్డుకుంటున్నారని అన్నారు. సీఎంతో సహ ఎవరు యానాం అభివృద్ధికి సహకరించడంలేదన్నారు.

అక్విడెక్ట్ కాల్వ తొట్టెపై రైలింగ్‌లో 16గేట్లు మాయం

పి.గన్నవరం,సెప్టెంబరు24: పి.గన్నవరం అక్విడెక్టు కాల్వ తొట్టె ఇన్‌సైడ్ పాత్ రైలింగ్‌కు సంబంధించి 16గేట్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. పి.గన్నవరం అక్విడెక్టుకు కాల్వ తొట్టెపై ఇన్‌సైడ్ పాత్‌కు ఉన్న రైలింగ్ గేట్లను ఇటీవలవరద పోటుకు ఇబ్బంది లేకుండా క్రిందికి దించారు. మంగళవారం ఉదయం రూ.1.5లక్షలువిలువైన 16గేట్లు అపహరణకు గురైనట్లు గుర్తించిన అవుట్‌సోర్సింగ్ లష్కర్లు ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. జేఈ సుందర్‌సింగ్ అక్విడెక్టు వద్దకు చేరుకుని రైలింగ్‌ను పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నెయ్యి కల్తీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

అమలాపురం రూరల్, సెప్టెంబరు 24: కోట్ల మంది హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ పంది కొవ్వుతో తయారుచేసిన నెయ్యితో స్వామివారి లడ్డూలు తయారు చేయించిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ అమలాపురం మండలం బండారులంకలో హిందూ యువత ఆధ్వర్యంలో మంగళవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈవ్యవహారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక బృందాలతో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈదీక్షలో బట్టు పండు, కాశిన ఫణీంద్ర, తులా సతీష్, మావూరి శివ, అక్కిశెట్టి వెంకటేష్, కాశిన శ్రీను, ఉప్పుగంటి సాయి తదితరులు పాల్గొన్నారు. ఈశిబిరాన్ని పి.గన్నవరం జనసేన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ పెనుమాల సునీత, చింతా శంకరమూర్తి, లింగోలు పండు, వాకపల్లి వెంకటేశ్వరరావు, హనుమాన్ బుజ్జి, మాడా మాధవి, పిచ్చిక శ్యామ్, ఆశపు చిన్నా సందర్శించారు.

ప్రాయశ్చిత్త దీక్షలో ఎమ్మెల్యే దేవ

రాజోలు, సెప్టెంబరు 24: తిరుమల లడ్డూ కల్తీ ఘటనను నిరసిస్తూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా కూటమి నాయకులు మంగళవారం శ్రీఆంజనేయస్వామి ఆలయం వద్ద దీక్ష చేపట్టారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సంఘీభావం తెలిపి ఈదీక్షలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు పితాని శ్రీనివాసరావు, దారపురెడ్డి బాబ్జి, అరవ లక్ష్మణరావు, కడలి వెంకటరమణారావు, కోళ్ల బాబి, ప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో గుండుబోగుల పెదకాపు, చాగంటిస్వామి, పినిశెట్టి బుజ్జి, మాజీ ఏఎంసీ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, విశ్రాంత ఎంఈవో జొన్నలగడ్డ గోపాలకృష్ణ, వైఎస్ ఎంపీపీ యింటిపల్లి ఆనందరాజు, మోకా పార్వతి, కడలి వెంకటరమణారావు, మానుకొండ దుర్గాప్రసాద్, కాండ్రేగుల కుశలుడు తదితరులు పాల్గొన్నారు.

నేదునూరు ఎంపీటీసీ రూ.లక్ష విరాళం



అయినవిల్లి,సెప్టెంబరు 24: విజయవాడ వరద బాధితుల కోసం నేదునూరు గ్రామానికి చెందిన ఎంపీటీసీ-2 ఇందుగుల వెంకట్రాయ్య కుమారుడు శ్రీను మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలుసుకుని రూ.లక్ష విరాళంగా అందజేశారు.

పేకాట క్లబ్‌లపై గవర్నర్‌కు ఫిర్యాదు



యానాం, సెప్టెంబరు24: యానాంలో రిక్రియేషన్ పేరుతో నడుస్తున్న పేకాట క్లబ్బులపై పుదుచ్చేరి గవర్నర్ కైలాసనాథ్‌కు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఫిర్యాదు చేశారు. పుదుచ్చేరి రాజ్‌నివాస్‌లో గవర్నర్‌ను మల్లాడి శాలువాతో సత్కరించి యానానికి సంబంధించిన అంశాలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం మల్లాడి యానాం మీడియాతో మాట్లాడారు. యానాంలో జరుగుతున్న పేకాట క్లబ్‌లు, రాజకీయ, అధికారుల పాత్రపై గవర్నర్‌కు వివరించి నట్టు చెప్పారు. ఓఎన్జీసీ నుంచి మత్స్యకారులకు రావలసిన 9నెలల పెండింగ్ పరిహారం తదితర పెండింగ్ అంశాలపై చర్చించినట్టు చెప్పారు. యానానికి సంబంధించిన అనేక అంశాలను గవర్నర్‌కు వివరించినట్టు చెప్పారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

మండపేట, సెప్టెంబరు 24: కాపురానికి తీసుకువెళ్లడం లేదని మనస్థాపం చెందిన వివాహిత ఆత్మహత్యకు పాల్పడిందని మండపేట పట్టణ ఎస్ఐ హరికోటి శాస్త్రి తెలిపారు. మండపేట ఏడిద రోడ్డులో వున్న అసాదుల కుటుంబానికి చెందిన గిరిసాల చిట్టివేణి(33)కి విజయవాడకు చెందిన ప్రభుకుమార్‌తో 2021లో వివాహమైంది. వీరిది కులాంతర వివాహం. ప్రభుకుమార్, అతడి కుటుంబసభ్యులు వేధిస్తుండటంతో చిట్టివేణి 2023లో పుట్టినిల్లు మండపేట వచ్చేసింది. ఏడాదిగా తల్లి వద్దనే ఉంటుంది. భర్త, అత్తింటి వేధింపులపై మండపేట పట్టణ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. కాపురానికి తీసుకువెళ్తామని భర్త కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అయితే ఎంతకి తీసుకువెళ్లకపోవడంతో మనస్థాపం చెందిన ఆమె మంగళవారం ఉదయం ఇంటిలో ఎవరు లేని సమయంలో చున్నితో ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తహసీల్దార్ తేజేశ్వరరావు, పట్టణ ఎస్ఐ హరికోటిశాస్త్రి సిబ్బందితో అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో బిల్లు కలెక్టర్ మృతి



అంబాజీపేట, సెప్టెంబరు24: పుల్లేటికుర్రు పంచాయతీ కార్యాలయంలో బిల్లు కలెక్టర్‌గా పనిచేస్తున్న పెండ్యాల సూర్యమోహన్(27) గుండెపోటుతో మంగళవారం మృతిచెందాడు. అమలాపురం మండలం భట్నవిల్లికి చెందిన సూర్యమోహన్ విధులు నిర్వహించేందుకు మోటార్‌సైకిల్‌పై పుల్లేటికుర్రు బయలుదేరాడు. ఆ సమయంలో గుండెపోటు రావడంతో బంధువులు అమలాపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మోహన్‌కు ఇంకా వివాహం కాలేదు. చిన్న వయస్సులో ఉద్యోగం రావడం ఆనందంగా ఉన్న ఆ కుటుంబ సభ్యులు మోహన్ మృతితో విచారం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీలు పబ్బినీడి రాం బాబు, కుసుమ వెంకటేష్, వడలి కృష్ణమూర్తి, పంచాయతీరాజ్ ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు.